ప్రజాశక్తి
బుధవారం 14 డిసెంబరు 2022
5
శ్రీకాకుళం

సంతాన సాఫల్య కేంద్రాల నమోదు తప్పనిసరి

శ్రీకాకుళం అర్బన్ : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంతాన సాఫల్య చికిత్సలు అందిస్తున్న కేంద్రాలు నమోదు చేసుకోవాలని ఇన్‌ఛార్జి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.అనూరాధ ఆదేశించారు. నగరంలోని డాక్టర్ శ్రీధర్, మెడికవర్, ఎ1 ఆస్పత్రుల్లోని ఎఆర్‌టి కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. కేంద్రాల వద్ద ధరల పట్టికను తెలుగులో ప్రదర్శించాలని స్పష్టం చేశారు. నూతన చట్టాన్ని అనుసరించి కేంద్రాల్లో మౌలిక వసతులు, రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో ప్రభుత్వ సర్వజనాస్పత్రి గైనిక్ విభాగం వైద్య నిపుణులు స్వర్ణలత, రేడియాలజీ విభాగం వైద్య నిపుణులు వెలమల శరత్‌చంద్ర, పాథాలజీ విభాగం వైద్య నిపుణులు జి.శ్రీదేవి, ఎన్‌జిఒ సభ్యుల మంత్రి వెంకటస్వామి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లకు సొమ్ములేవీ?

- పేరుకుపోతున్న బకాయిలు
- జిల్లాలో రూ.175 కోట్లు పెండింగ్
- రబీలో చెల్లిస్తారని ఎదురుచూసిన మిల్లర్లు
- బ్యాంకు గ్యారంటీల సమర్పణలో ఆర్థిక ఇబ్బందులు

ధాన్యం సేకరణలో గతంలో ఎన్నడూ లేని విధంగా మిల్లర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో కష్టాలు వారిని వెంటాడుతున్నాయి. బ్యాంకు గ్యారంటీలు సమర్పించిన వారికే ప్రభుత్వం ధాన్యం సరఫరా చేస్తోంది. ప్రభుత్వం సకాలంలో వారి బకాయిలను చెల్లించకపోవడంతో బ్యాంకు గ్యారంటీలు సమర్పించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రబీలో ప్రభుత్వం బకాయి డబ్బులు విడుదల చేస్తుందని మిల్లర్లు ఆశించినా చెల్లింపులు చేయలేదు. కనీసం ఖరీఫ్‌లోనైనా సొమ్ములు ఇస్తుందని ఆశలు పెట్టుకున్నారు. కేవలం రూ.మూడు కోట్లే ఇవ్వడంతో అవి ఎందుకూ చాలడం లేదు. వడ్డీలు కడుతూ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు సమర్పిస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో రవాణా, కస్టమ్ మిల్లింగ్, సార్టెక్స్ తదితర ఛార్జీలు కలిపి సుమారు రూ.175 కోట్లు ప్రభుత్వం బకాయి పడింది. రబీ సీజన్‌లో చెల్లిస్తుందని ఆశగా ఎదురుచూశారు. ఖరీఫ్ ప్రారంభమై ధాన్యం కొనుగోలు మొదలుపెట్టినా బకాయి సొమ్ములు మాత్రం చెల్లించలేదు. రైతు నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి నిర్దిష్ట గడువును విధించి 21 రోజుల్లోగా చెల్లిస్తోంది. మిల్లర్ల విషయంలో మాత్రం కనికరించడం లేదు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇప్పటివరకు 15,472 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ప్రభుత్వం ఈ ఏడాది ధాన్యం సేకరణలో తీసుకొచ్చిన మార్పులతో అటు రైతులు, ఇటు మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌బికెలు ఏర్పాటుకు ముందు కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లర్లకు ధాన్యం చేరేది. ధాన్యంలో తేమ శాతం, కవ్వ, పొల్లు ధాన్యం ఉన్నా మిల్లర్లతో రైతులే మాట్లాడుకుని సర్దుబాటు చేసుకునే పరిస్థితి ఉండేది. రెండేళ్ల కిందట ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు మొదలుపెట్టింది. ఆర్‌బికెల్లో రైతుల పేర్లను నమోదు చేసుకుని ధాన్యం ఎప్పుడు కొంటారో షెడ్యూల్ ఇచ్చేవారు. ఆ సమయానికి ధాన్యాన్ని మిల్లులకు తరలించేవారు.

కచ్చితత్వం లేని శాంపిల్ పరీక్షలు

ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ధాన్యం సేకరణలో సమూల మార్పులు తీసుకొచ్చింది. కళ్లాల్లో ధాన్యం శాంపిల్స్‌ను పరీక్షించి ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే వాటిని ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. అక్కడ నుంచి వేబ్రిడ్జికి తరలించి ట్రక్ షీట్ రూపొందిస్తున్నారు. అక్కడ నుంచి మిల్లులకు తరలిస్తున్నారు. సాంకేతిక సిబ్బంది సరిగ్గా పరీక్షలు చేయకపోవడంతో, వాటిని తీసుకునేందుకు మిల్లర్లు విముఖత చూపుతున్నారు. తాము పంపిన ధాన్యాన్ని మిల్లర్లు తిరస్కరించడమేంటని రైతులు ఆర్‌బికె సిబ్బంది చెప్పుడడంతో వారి మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయి.

రూ.175 కోట్ల బకాయిలు పెండింగ్

ప్రభుత్వం అన్నిరకాల బకాయిలు కలిపి సుమారు రూ.175 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది. వీటిలో ధాన్యం రవాణా ఛార్జీలు రూ.50 కోట్ల మేర ఉంది. సార్టెక్స్ ఛార్జీలు రూ.40 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. ఆరబోత ఛార్జీలు రూ.10 కోట్లు, గన్నీ బ్యాగుల వినియోగ ఛార్జీలు రూ.15 కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు రెండేళ్లుగా కస్టమ్ మిల్లింగ్ ఛార్జీలు సుమారు రూ.15 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం సకాలంలో సొమ్ములు చెల్లించకపోవడంతో మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మెషినరీ లేక ఇబ్బందులు

ప్రభుత్వం ఈసారి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని మాత్రమే తీసుకుంటామని షరతు విధించింది. ఇందుకోసం నాన్ సార్టెక్స్ బ్లెండింగ్ మిషన్లు సమకూర్చుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో 272 మిల్లులు ఉండగా, ఇప్పటివరకు 220 మిల్లుల వరకు యంత్ర సామగ్రిని ఏర్పాటు చేసుకోగలిగారు. ఆస్తులను తాకట్టు పెట్టి కొందరు, అప్పులు చేసి మరీ మెషినరీని కొనుగోలు చేశారు. మిగిలిన 52 మంది యంత్ర సామగ్రి లేకపోవడంతో బ్యాంకు గ్యారంటీలను సమర్పించలేకపోయారు. సార్టెక్స్ బియ్యం ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని మిల్లర్లు కోరుతున్నారు.

ధర్నా చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

జీతం బకాయిలు చెల్లించాలి

పోస్టల్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగుల స్థానంలో పనిచేస్తున్న 200 మంది జిడిఎస్ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారని, తక్షణమే జీతాలు చెల్లించాలని పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.గణపతిరావు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై నగరంలోని పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. పోస్టల్ శాఖలో గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న జిడిఎస్ ఉద్యోగులు సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. వారి సంక్షేమం విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. జిడిఎస్ ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడమే కాకుండా ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను నోచుకోకుండా చేస్తోందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిన డైరెక్టరేట్ ఉత్తర్వులను వక్రీకరించి శ్రీకాకుళం డివిజన్ సూపరింటెండెంట్ నెలల తరబడి జిడిఎస్ ఉద్యోగులకు జీతభత్యాలు మంజూరు చేయకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. ఐదు నెలలుగా సుమారు 200 మందికి జీతభత్యాలు మంజూరు చేయలేదన్నారు. దీనిపై సూపరింటెండెంట్‌ను అడుగుతున్నా, అధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని జీతాలు చెల్లించకుండా అడ్డుపడుతున్నారన్నారు. కొంతమంది సబ్ డివిజనల్ అధికారులు జిడిఎస్ ఉద్యోగులకు లక్ష్యాలను పూర్తి చేయకపోతే జీతాలు, సెలవులను నిలిపేస్తామని వేధిస్తున్నారని, దీనివల్ల వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థగా చెప్పుకుంటున్నా, సరైన మౌలిక సౌకర్యాలేకి విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న బ్రాంచి పోస్టుమాస్టర్లు ఆఫీసులో కనీస అవసరాలైన డిపాజిట్ ఫారాలు, డైలీ అకౌంట్ ఫారాలను వారి సొంత ఖర్చులతో జిరాక్సులు తీయించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాకు పోస్టల్ పెన్షనర్స్ యూనియన్ నాయకులు జి.వీరభద్రరావు, జి.అప్పారావు, ఎల్.ప్రకాశరావు, గిరిమిత్ర విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి సంఘీభావం తెలిపారు. ధర్నాలో సంఘ నాయకులు ఎల్.బాబూరావు, ఎన్.నందికేశ్వరరావు, టి.వెంకటేశ్వర్లు, బి.చంద్రమోహన్, ఎం.చిన్నారావు, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఇళ్ల నిర్మాణాలకు ఇంకెన్నాళ్లు..?

- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- హౌసింగ్ డిఇ, ఎఇలకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబాటుపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని లొద్దపుట్టిలో అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలు ఎందుకు జాప్యమవుతున్నాయని హౌసింగ్ డిఇ రామకృష్ణ, రూరల్ ఎఇ దిలీప్‌ను ప్రశ్నించారు. లోతట్టు ప్రాంతం కావడం వల్ల లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు వెనుకంజ వేస్తున్నారని వారు బదులిచ్చారు. లోతట్టు ప్రాంతాన్ని ఎత్తు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని మేలో చెప్పినా, నేటికీ సిద్ధం చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మున్సిపాల్టీ పరిధిలోని రత్తకన్న లేఅవుట్‌ను, బెల్లుపడ కాలనీ సచివాలయాన్ని పరిశీలించారు. ఈ కాలనీకి రావడానికి రైల్వే అండర్ పాస్ వే సమస్యను గుర్తించిన కలెక్టర్, అందుకోసం ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలకు చర్యలు తీసుకోవాలన్నారు. బెల్లుపడ లేఅవుట్ కోర్టు కేసులో ఉన్నందున లబ్ధిదారులకు వేరే ప్రాంతంలో స్థలం కేటాయించేలా చర్యలు చేపట్టాని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాల్టీలో ఎఐఐబి ప్రాజెక్టులో భాగంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం స్థలం కేటాయించాలని, కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, ఎంపిపి బోర పుష్ప, ఎంపిడిఒ రామారావు, డిప్యూటీ తహశీల్దార్ గురుప్రసాద్, కౌన్సిలర్లు మధుమూర్తి, ప్రేమ కుమార్, ఎన్.లక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బి.వి రామ్

పాలన చేతగాక సమైక్య రాగం

తెలుగు శక్తి రాష్ట్ర అధ్యక్షుడు బి.వి రామ్

పలాస : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పాలన చేతగాక మళ్లీ సమైక్య రాగం పాడుతున్నారని తెలుగు శక్తి రాష్ట్ర అధ్యక్షుడు బి.వి రామ్ విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషతో కలిసి మాట్లాడారు. మూడు రాజధానులు అంటూ ప్రగల్భాలు పలికిన జగన్, సమైక్యవాదం అంటూ ఎవరిని మోసం చేస్తారని ప్రశ్నించారు. మూడు రాజధానుల పేరుతో విశాఖ కొండలను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో జగన్‌తో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను, ఉపాధ్యాయులు, ఉద్యోగులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఏకైక రాజధానిగా అమరావతికే ఉత్తరాంధ్ర ప్రజలు మద్దతు పలుకుతున్నారని చెప్పారు. ఎందరో ఉద్దండులకు పేరొందిన ఉత్తరాంధ్ర ప్రతిష్టను మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు మంటగలుపుతున్నారని దుయ్యబట్టారు. వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో మళ్లీ టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా కార్యదర్శి పి.విఠల్‌రావు, బి.దొరబాబు, డి.పరమేశ్వరరావు, డి.వెంకటరమణ, జె.రమణ, గాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా సాయిరాం

ఐదోసారీ ఏకగ్రీవంగా ఎన్నిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా హనుమంతు సాయిరాం ఐదోసారీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలో తాలూకా ఎన్నికలు ఇప్పటికే ఏకగ్రీవం కాగా, జిల్లా కార్యవర్గానికి సంబంధించి 15 పదవులకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను నగరంలోని ఎన్‌జిఒ హోంలో మంగళవారం నిర్వహించారు. అధ్యక్ష స్థానంతో పాటు మిగిలిన పదవులకు సింగిల్ నామినేషన్ దాఖలు కావడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మురళి ప్రకటించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, సహాధ్యక్షునిగా కె.జయరావు, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, టి.సోమేశ్వరరావు, డి.శశిభూషణరావు, డి.రాజకుమార్, డి.శ్రీరామ్ కుమార్ ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్.గోవింద పట్నాయక్, సంయుక్త కార్యదర్శులుగా డి.అప్పన్న, రాధాకృష్ణ, బి.భాస్కరప్రసాద్, జి.రత్నకుమార్, మహిళా సంయుక్త కార్యదర్శిగా కె.రోజాకుమారి, కోశాధికారిగా బి.పూర్ణచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాయ ఎన్నికల అధికారిగా ఎ.సురేష్, ఎన్నికల పరిశీలకులుగా డి.వెంకటరమణ వ్యవహరించారు.



సమిష్టి నిర్ణయానికి పెద్దపీట

ఏడు దశాబ్దాల చరిత్ర గల ఎన్‌జిఒ అసోసియేషన్‌లో పదవులకు పోటీ లేకుండా ఉద్యోగులంతా ఏకతాటిపై నిలిచి కార్యవర్గాన్ని బలపరచడం అభినందనీయమని అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పూలమాలలు వేసి అభినందించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రణాళికను రూపొందిస్తామన్నారు. ఐదోసారి ఎన్నుకోవడం ద్వారా తనపై మరింత బాధ్యత పెరిగిందని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం అన్నారు. ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు అన్నారు.

12 టన్నుల పిడిఎఫ్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పలాస

మండలంలోని సున్నాడలో అక్రమంగా నిల్వ చేసిన 12 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. సున్నాడకు చెందిన కె.లావణ్య పిడిఎఫ్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేస్తోంది. ఆ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించేందుకు తన ఇంట్లో నిల్వ చేస్తోంది. విషయం తెలుసుకున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు విజిలెన్స్ ఎస్ఐ బి.రామారావు రెవెన్యూ అధికారులతో కలిసి సోమవారం రాత్రి ఆమె ఇంటిపై దాడి చేశారు. అక్రమంగా నిల్వ చేసిన 12 టన్నుల గల 254 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.4.58 లక్షల విలువ చేసే బియ్యాన్ని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సిఎస్‌డిటి నళినికి అందజేసి, ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. లావణ్యపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ రామారావు తెలిపారు. దాడిలో విజిలెన్స్ హెచ్‌సి కె.అప్పన్న, ఐ.ఈశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పట్టుబడిన బియ్యం బస్తాలు

పోటీలను ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

జోనల్ స్థాయి గ్రిగ్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆమదాలవలస

జోనల్ స్థాయి గ్రిగ్స్ ఆటల పోటీలను మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం ప్రారంభించారు. ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన 58 పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈనెల 16వ తేదీ వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమేనని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న తొగరాం మైదానాన్ని మినీ స్టేడియంగా అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కరకట్టల నిర్మాణానికి శంకుస్థాపన

కరకట్టల నిర్మాణంతో నదీ పరివాహక ప్రాంత ప్రజలకు భద్రత చేకూరుతుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కలివరంలో రూ.25 లక్షల అంచనాలతో రివర్ ప్రొటెక్షన్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి తమ్మినేని శారదమ్మ, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, వైస్ ఎంపిపిలు మానుకొండ ధనలక్ష్మి, జగన్నాథరావు, వైసిపి మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సర్పంచ్‌లు ఎన్ని రామచంద్రరావు, చిలకలపల్లి సురేష్, మెట్ట ఆనందరావు, జి.నీలారావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

శ్రీకాకుళం : ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించడం ద్వారా కొంతమేరకు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లావ్యాప్త పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ కేసుల రికార్డుల నిర్వహణ, దర్యాప్తు విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తూ వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. నేరాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నివారణకు మహిళా పోలీసుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో దత్తత కానిస్టేబుళ్లను ఎప్పటికప్పుడు సందర్శించి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు.

ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు

విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా పోలీసులు కర్రి త్రివేణి, ఎర్ర ధనలక్ష్మి, బాలామణి, గ్రేవ్ కేసుల ఛేదనలో ప్రతిభ చూపిన డిఎస్‌పి ఎం.మహేంద్ర, ఆమదాలవలస సిఐ పైడయ్య, పొందూరు ఎస్ఐ లక్ష్మణరావుకు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఛార్జిషీట్స్ దాఖలు, కేసుల ఛేదనలో, రహదారి ప్రమాదాల నివారణలో ప్రతిభ చూపిన సిఐ స్వామినాయుడు, ఎస్ఐలు రాజేష్, కోటేశ్వరరావు, సింహాచలం, రామకృష్ణ, సత్యనారాయణ, రామారావు, మహ్మద్ ఆమిర్ ఆలీ, చిరంజీవి, ప్రవల్లిక, ఎఎస్ఐ జోగారావుకు ప్రశంసాపత్రాలను అందించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి టి.పి విఠలేశ్వర్, డిఎస్‌పిలు ఎం.శివరామిరెడ్డి, ఎస్.వాసుదేవ్, సిహెచ్.జి.వి ప్రసాద్, జి.శ్రీనివాసరావు, బి.విజయకుమార్, ఎస్.బాలరాజు, పరిపాలన అధికారి శివరామరాజు, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభించకపోతే రద్దు

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పనులు ప్రారంభించకపోతే వాటిని రద్దు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. మినరల్ ఫండ్స్ పనులపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో మంగళవారం సమీక్షించారు. జిల్లాలో 582 పనులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రారంభం కాని పనులను 15 రోజుల్లో ప్రారంభించాలన్నారు. కొన్ని పనులు పలు దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 226 పనులు పూర్తి కాగా, ఆర్‌డబ్ల్యుఎస్‌లో అధికంగా 121 పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. పనులు చేయకపోతే వాటి స్థానంలో కొత్త పనులు మంజూరు చేస్తామన్నారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపాలిటీల్లో పనులు చేయాల్సి ఉందన్నారు. ఇరిగేషన్ పనులపై కలెక్టర్ ప్రశ్నించగా, నీరు ఖాళీ అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఎస్ఇ సుధాకర్ చెప్పారు.

టెండర్లు పూర్తయ్యాయని, మూడు నెలల్లో ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. పనులు పూర్తి చేసిన బిల్లులను అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీనరేజస్ ఛార్జీలు మైనింగ్ శాఖకు రావడం లేదన్నారు. సమావేశంలో భూగర్భ గనుల శాఖ డీడీ డి.ఫణిభూషణ్ రెడ్డి, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, పంచాయతీరాజ్ ఎస్ఇ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఆర్‌బికెలతోనే రైతులకు మద్దతు ధర

ప్రజాశక్తి - ఆమదాలవలస, జలుమూరు

రైతు భరోసా కేంద్రాల ద్వారానే ధాన్యం రైతులకు మద్దతు ధర లభిస్తుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఆమదాలవలస మండలంలోని సైలాడ రైతుభరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఆమదాలవలస మున్సిపాల్టీ పరిధిలోని మొనింగివారి వీధిలో గల సచివాలయం-1, 2ను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. చింతాడ, మెట్టక్కివలసలో నిర్మించ తలపెట్టిన మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుల స్థలాలను పరిశీలించారు. జలుమూరు తహశీల్దార్ కార్యాలయంలో ధాన్యం సేకరణపై అధికారులతో సమీక్షించారు. ఆర్‌బికెల వద్ద ధాన్యం కొనుగోలు కోసం నియమించిన టెక్నికల్ అసిస్టెంట్లకు తేమ శాతం పరీక్షపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. మిల్లుకు పంపించిన ధాన్యాన్ని మిల్లర్లు దించడం లేదని జెసి కార్యాలయానికి ఫిర్యాదులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌బికె వద్ద తేమ చూసి మిల్లుకు పంపించిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవాలి తప్ప అక్కడ మళ్లీ తేమ శాతం పరీక్షించడం ఏమిటని ప్రశ్నించారు. తేమ శాతం చూడడంలో టెక్నికల్ సిబ్బంది అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, ఎఇ కె.అప్పలనాయుడు, ప్రజారోగ్య శాఖ ఇఇ పి.సుగుణాకరరావు, తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ రాంబాబు, జలుమూరు మండల ప్రత్యేకాధికారి కె.రాజగోపాలరావు, డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీనివాస్, ఎఒ కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సిబ్బందితో సమీక్షిస్తున్న జెసి నవీన్

ప్రిన్సిపల్‌పై లోతైన విచారణ

శ్రీకాకుళం ప్రతినిధి : శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖపై రెండో రోజు మంగళవారం లోతైన విచారణ సాగింది. అకడమిక్ గైడెన్స్ అధికారి తులసీ మస్తానమ్మ, ఆర్‌జెడి సిహెచ్.కృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ శంకరరావుతో కూడిన కమిటీ విచారణ కమిటీలోని ఇద్దరు అధికారులు ఏలూరు జిల్లా పాలకొల్లులో మరో విచారణ చేపట్టాల్సి ఉండడంతో వారు మంగళవారం వెళ్లిపోయారు. డిప్యూటీ డైరెక్టర్ శంకరరావు విచారణను కొనసాగించారు. విచారణలో భాగంగా రెండో రోజు కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్స్, బోధనేతర సిబ్బందిని పిలిచి మాట్లాడారు. అధ్యాపకులకు నవంబర్‌లో చెల్లించాల్సిన స్పాట్ వ్యాల్యుయేషన్ బిల్లులను మార్చిలో చెల్లించడమేమిటని ప్రశ్నించినట్లు సమాచారం. 2017-18 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.35 లక్షలు రాగా, అప్పట్లో రూ.18 లక్షలు చెల్లించారు. మిగిలిన డబ్బులు ఇప్పటివరకు ఎందుకు చెల్లించలేదని, చెల్లించాల్సిన అవసరం లేకుంటే ప్రభుత్వానికి ఎందుకు అప్పగించలేదని ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది. తర్వాత కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుల హాజరు పట్టీని క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిసింది. రెండు రోజులుగా సాగిన విచారణలో కమిటీ గుర్తించిన వివరాలను, సేకరించిన సాక్ష్యాలను తమ వెంట తీసుకువెళ్లినట్లు తెలిసింది.

IN THE HONORABLE COURT OF THE JUDICIAL MAGISTRATE OF 1ST CLASS-CUM- ADDITIONAL JUNIOR CIVIL JUDGE, AT SRIKAKULAM.

O.S.NO.274/2021

BETWEEN:
Boddu Satyanarayana ...Plaintiff
AND
L. Chandrika (styling as Boddu Chandrika), and two others ...Defendants

To
1. L. CHANDRIKA (STYLING AS BODDU CHANDRIKA), W/O JANARDHANA RAO, PRESENTLY RESIDING WITH MOTHER, LOLUGU GOPAMMA, TF2, NAVYA ENCLAVE, OPP. INDU SALOON, NEW SRIKRISHNA NAGAR, RADHARKRISHNA NAGAR COLONY, VISAKHA 'A' COLONY, SRIKAKULAM TOWN & DISTRICT. 7995370558, 8523825800
2. MOHANA SAI, D/O JANARDHANA RAO, BEING MINOR REPRESENTED BY NATURAL GUARDIAN, MOTHER. THE 1ST DEFENDANT HEREIN, - REST DO -
3. MOUNIKA, - REST DO -

NOTICE

It is to inform you all that the above main suit **O.S.No.274/2021,** on the file of the 1st Addl., Junior Civil Judge, Srikakulam, is stands posted to dt. **15-12-2022** for your appearance and all you are hereby noticed to appear on the aforesaid date before the above Court at **10-30** A.M. in person or through Advocate, otherwise the above matter will be decided against you in your absence.

S.GOVINDA RAJULU, (GOPI),
Advocate for Plaintiff, Arasavilli, Srikakulam.

మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ప్రభుత్వం ప్రజా వ్యతిరేక వైఫల్యాలను ఎండగట్టాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని నిమ్మాడలో అచ్చెన్న క్యాంపు కార్యాలయంలో జిల్లా నలుమూల నుంచి టిడిపి నాయకులు, కార్యర్తలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు టిడిపి నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపునకు ప్రతిఒక్క కార్యకర్తా సైనికుల్లా పనిచేయాలన్నారు. కలిసిన వారిలో నగర కులస్థుల సంఘం నాయకులు, జలుమూరు మండలం చిన్నదూగం పంచాయతీ నాయకులు, టెక్కలి పంచాయతీ నాయకులు, కోటబొమ్మాళి, కురుడు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

కుళాయి పనులు వేగవంతం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

జలజీవన్ ప్రాజెక్టు ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష లాఠకర్ ఆదేశించారు. మండలంలోని అనంతగిరి, వెంకటాపురంల్లో చేపడుతునన పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో ప్రజలకు తాగునీరు అందించడానికి బహత్తర పథకమని అన్నారు. ఉద్దానంలోని కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. పనులను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పరిశీలించాలని సూచించారు. ఈయన వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ టి.ఎస్.ప్రసాద్, ఇఇ జాన్ బెహనూర్, డిఇఇ దుర్యోధన, ఉద్దానం ప్రాజెక్టు డిఇఇ ఆశాలత, ఎఇఇ సతీష్‌కుమార్, సర్పంచ్ కె.మల్లేశ్వరస్వామి ఉన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల 15న ఉదయం 7 నుంచి 12 గంటల వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశామని నిర్వాహకులు టి.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రోగులు ఒరిజినల్ ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకురావాలని సూచించారు. అలాగే బిసి, సుగర్‌కూ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తామని పేర్కొన్నారు. రోగులను ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9848907299ను సంప్రదించాలన్నారు.

ముందస్తు ప్రణాళికలతో పంచాయతీల అభివృద్ధి

పొందూరు : మాట్లాడుతున్న జెడ్‌పిటిసి కాంతారావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ముందస్తు ప్రణాళికలతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఎంపిడిఒ ఎం.రేణుక అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిటిసిలకు, సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించడం ద్వారా నిధులు సమకూరుతాయన్నారు. తద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చునని పేర్కొన్నారు. మౌలిక వసతులు సమకూర్చుకొని గ్రామాలను ప్రగతి పథంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గ్రామీణ అభివృద్ధి, ఉపాధి హామీ, పేదలందరికీ ఇళ్లు, సెరికల్చర్, హార్టికల్చర్, పాడి పరిశ్రమ అభివృద్ధి తదితర అంశాలపై విపులంగా వివరించారు. మండల పరిషత్ పరిపాలనాధికారి వాసుదేవరావు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పొందూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న నిధులతో పంచాయతీల్లో తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పన చేయాలన్నారు. ఎంపిపి సీపాన హరిహరరావు మాట్లాడుతూ 2023-24లో పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు జిపిడిపిలో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.వి.రామరాజు, ఎఒ బాబ్జి పాల్గొన్నారు.

నౌపడ : పంచాయతీలు అభివృద్ధి నాయకులు, అధికారులు సమన్వయంగా పనిచేస్తూ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపిడిఒ జి.ఉమాసుందరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

లావేరు : ప్రజాప్రతినిధులు గ్రామస్థాయి నుంచి మండల స్థాయి అధికారులు వరకు సమిష్టి కృషితోనే సత్ఫలితాలు సాధించవచ్చునని మండల ప్రత్యేక అధికారి అనూరాధ అన్నారు మండల పరిసిత్ సమావేశ మందిరంలో పంచాయతీ అభివద్ధి ప్రణాళికలపై సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమంలో నిర్వహించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వి.విశ్వేశ్వరరావు, ఎపిఎం మాఊరు మాధవీలత పాల్గొన్నారు.

మెళియాపుట్టి : గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన అందరి బాధ్యత అని ఎంపిడిఒ పి.చంద్రకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు, సచివాలయ సిబ్బంది శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

నౌపడ : మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉమాసుందరి

ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న టిడిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు

నిధులు లేకుండా అభివృద్ధి ఎలా?

ఆమదాలవలస : పంచాయతీలకు నిధులు లేకుండా అభివృద్ధి ఎలా సాధ్యమని టిడిపి సర్పంచ్‌లు సనపల ఢిల్లేశ్వరరావు, నూకరాజు ప్రభుత్వానికి ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు నిర్వహించిన పంచాయతీల అభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మంగళవారం ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిందని ఆరోపించారు. వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి సర్పంచ్‌లకు గౌరవం లేకుండా చేశారని మండిపడ్డారు. అనంతరం పరిపాలనాధికారి వాసుదేవరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు అన్నెపు భాస్కరరావు, బండి ప్రభావతి, సర్పంచ్‌లు గొండు రమణ, గుజ్జల లక్ష్మణరావు, సొండి దమయంతి, గొర్లె రామశంకర్ పాల్గొన్నారు.

'రాష్ట్రానికి ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి - కంచిలి

స్థానిక ఎమ్మెల్యే బెందాలం అశోక్ అధ్యక్షతన కత్తివరంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్నిమంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడున్నరేళ్లలో ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలపై పడిన వడ్డీల భారం వివరించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నుంచి రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల వరకూ ప్రజల ద్వారానే చెప్పించారు. కార్యక్రమంలో మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, బంగారు కొరయ్య, వాసాల రమేష్‌రెడ్డి, తమరాల శోభన్‌బాబు, పూర్ణచంద్ర, సూర్యనారాయణరెడ్డి, తారకేశ్వరరావు, కృష్ణారావు అప్పారావు పాల్గొన్నారు.

కంచిలి : ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అశోక్

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని పొట్టిశ్రీరాములు మార్కెట్‌లో టిడిపి వాణిజ్య విభాగం ఆధ్వర్యాన మాజీ ఎమ్మెల్యే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరాడ హరిగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్నూరు కృష్ణమూర్తి, పొట్నూరు తులసీరామ్, ఇప్పలి వెంకటరమణ, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, మాదారపు వెంకటేష్, రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, ముద్దాడ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : పోస్టర్‌ను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

వజ్రపుకొత్తూరు : రాష్ట్రం అరాచక పాలన సాగిస్తున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని సాగపడానికి ప్రజలు సిద్ధం కావాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పిలుపునిచ్చారు. మండలంలోని వజ్రపుకొత్తూరు, చినకొత్తూరు గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శశిభూషణ్, ఎంపిటిసి మాజీ సభ్యులు నీలకంఠం, గోవిందపురం పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు, మరడ దుర్యోధన, కర్ని రమణ, హనుమంతు గిరిధర్, ఎ.ఉమామహేశ్వరరావు, ఎ.పాపారావు, కె.కిరణ్‌కుమార్, టి. గోపాలరావు, అంబటి రామకృష్ణ, ఎస్.సూర్యనరాయాణ, ఆనంద్ పాల్గొన్నారు.

కవిటి: రాష్ట్రం రోజురోజుకీ తిరోగమనంలో పయనిస్తోందని, ప్రజలు అభివృద్ధి అనే మాట మరిచిపోయి మూడున్నరేళ్ల యిందని టిడిపి నాయకులు సీపాన వెంకటరమణ, బెందాలం రమేష్ అన్నారు. మండలంలోని బి.గొనపపుటుగలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పొందల కృష్ణారావు, ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, లోళ్ల శ్రీను, సంతోష్ పట్నాయక్, మణి చంద్రప్రకాష్, బెందాళం విజయ్, పుల్లట రాజు, బార్ల చినబాబు పాల్గొన్నారు.

పలాస : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని గద్దెదించడమే లక్ష్యంతో ప్రతి కార్యకర్తా పనిచేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు పిలుపునిచ్చారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణ, అంబటి కృష్ణమూర్తి, చంద్రరావు, ఆత్మారావు, చిలకమ్మ, తంగుడు హరికృష్ణ, బాడాడ ఉమకాంత్, నాబిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పోస్టర్లను ప్రదర్శిస్తున్న టిడిపి నాయకులు

తల్లి అంత్యక్రియలు చేస్తున్న కుమార్తె ఉష

తల్లి చితికి తనయ తలకొరివి

ప్రజాశక్తి - జలుమూరు

తల్లి చితికి తనయ తలకొరివి పెట్టిన సంఘటన మండలంలోని జోనంకి పంచాయతీ పరిధి గంగాధరపేటలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పైడి అనసూయ (55) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందింది. ఆమెకు కుమారులు లేకపోవడంతో వాలంటీర్‌గా పనిచేస్తున్న కుమార్తె ఉష దుఃఖాన్ని దిగమింగుకుని తలకొరివి పెట్టి తల్లి రుణం తీర్చుకుంది. మృతురాలి భర్త రామారావు 12 ఏళ్ల క్రితం లారీ ప్రమాదంలో మృతి చెందారు. అనసూయ, రామారావు దంపతులకు మొదటి సంతానంలో పుట్టిన కుమారుడు చిన్న వయసులోనే చనిపోయాడు. రెండో సంతానంలో కుమార్తె ఉష జన్మించింది. ఉషకు జోనంకి పంచాయతీ పరిధిలోని కూనలచ్చున్నాయుడుపేటకు చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహం చేశారు.

నేడు రైతు సదస్సు

బూర్జ : ఈ నెల 14న ఎంపిడిఒ కార్యాలయంలో ఉద్యాన పంటల రైతులకు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామని డాక్టర్ బివికె భగవాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో రైతులకు ఉద్యాన పంటలతో కలిగే లాభాలపై అవగాహన కల్పిస్తామన్నారు. దీంతో పాటు ఉద్యాన పంటల రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎరువులు, యాజమాన్య సమగ్ర సస్యరక్షణ చర్యలు వివరిస్తామన్నారు.

మాట్లాడుతున్న వెంకటరావు

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం అర్బన్ : విద్యార్థులపై లైంగిక వేధింపులు, అత్యాచార ఘటనలు, బాల్య వివాహాలు, చైల్డ్ లేబరు, కిడ్నాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని యాంటీ హ్యూమన్ ట్రాకింగ్, చైల్డ్‌లైన్ విభాగాల ఎస్ఐ ఎల్.వెంకటరావు సూచించారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు దేవదత్తానంద్ అధ్యక్షతన విద్యార్థులకు మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలపై ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. ఎక్కడైనా భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నట్టు గ్రహిస్తే తక్షణమే 100 గాని, కుటుంబ సభ్యులకు గాని సమాచారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు డి.రమణమూర్తి, పి.శంకరరావు, చైల్డ్‌లైన్ ప్రతినిధులు హేమలత, మెహర్‌వాణి పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ అన్నపూర్ణారావు

'నాడు-నేడు' పనుల పరిశీలన

పోలాకి: పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పనకు, మేజర్, మైనర్ మరమ్మతులకు నాడు-నేడు కింద ప్రభుత్వం రూ.1.17 కోట్లు మంజూరు చేసిందని ప్రిన్సిపాల్ ఎస్.అన్నపూర్ణారావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో చేపట్టిన నిర్మాణా పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో నాన్యతా ప్రమానాలు పాటించాలని సూచించారు. కళాశాలకు మంజూరైన ఈ నిధులతో బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, డ్రింకింగ్ వాటర్, ఆర్‌ఒ ప్లాంటు ఏర్పాటు, విద్యుత్ సామగ్రి, గ్రీన్‌చార్ట్ బోర్డు, ఫర్నేచర్, లేబ్ రూమ్‌లు మరమ్మలు చేపడుతున్నామని అన్నారు. ఈయన వెంట స్కూల్ కమిటీ చైర్మన్ బరాటం కృష్ణ, ఉపాధ్యాయులు లత, కరుణ, సునీత, గౌరి, త్రినాథరావు ఉన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం

కవిటి: 104 సంచార వైద్య విధానం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్టు డాక్టర్ పూడి రామారావు తెలిపారు. మండలంలోని కవిటికొత్తూరు, కొత్తపాలెం గ్రామాల్లో 104 వాహనం ద్వారా వైద్య సేవలు మంగళవారం అందించారు. ఇంటివద్ద నుంచి రాలేని పరిస్థితిలో ఉన్న రోగుల వద్దకు వెళ్లి వైద్యం అందజేశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం-పాటించాల్సిన నియమాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. స్థానిక ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

18న యుటిఎఫ్ 5కె వాక్

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

యుటిఎఫ్ ఆధ్వర్యాన సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న 5కె వాక్ నిర్వహిస్తున్నట్టు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ తెలిపారు. సిపిఎస్ ఇంటికి యుటిఎఫ్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని మంగళవారం ఉపాధ్యాయుల ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఎన్నికల హామీగా వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని నమ్మబలికారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా సిపిఎస్ రద్దు కోసం ఉద్యమిస్తుంటే ఉద్యోగులపై, ఉపాధ్యాయులపై నిర్బంధాలను ప్రయోగిస్తూ బైండోవర్ కేసులు పెడుతున్నారన్నారు. భవిష్యత్‌లో పెద్ద ఎత్తున సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులతో పోరాట చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బి.క్రాంతికుమార్, జి.విశ్వనాథం, కె.శ్రీను, పి.మల్లేశ్వరరావు, ఎస్.అనిల్ కుమార్, బి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పూర్తికి చర్యలు

బూర్జ: ఈ నెల 21న నాటికి జగనన్న గృహాల పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని లబ్ధిదారులకు అందజేయాలని గృహ నిర్మాణశాఖ పీడీ గణపతిరావు హౌసింగ్ ఎఇ ఎం.వి.వి.రమణకు ఆదేశించారు. మండలంలోని కొల్లివలస, చీడివలస గ్రామాల్లో జగన్న ఇళ్ల నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 1773 గృహాలు మంజూరు కాగా, 782 బేస్‌మెంట్ లెవెల్, వంద పునాది స్థాయిలో, 101 గోడలు ఎత్తు, 321 వరకు శ్లాబ్ లెవెల్ వరకూ ఉన్నాయన్నారు. అలాగే జగనన్న కాలనీలో సిసి రోడ్లు, విద్యుత్ లైన్, వాటర్ ట్యాంకు పనులను పరిశీలించారు. బిల్లులు చెల్లింపులో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది పెట్టకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంప్రసాద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సత్తి ప్రసాద్, హౌసింగ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న పీడీ గణపతిరావు

నిర్వాసితులకు అదనపు పరిహారం చెల్లించాలి

ఆందోళన చేస్తున్న గూనభద్ర నిర్వాసితులు

ప్రజాశక్తి - కొత్తూరు

వంశధార నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న అదనపు పరిహారం పరిహారం వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచల ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని గూనభద్ర నిర్వాసితులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరికే అదనపు పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. వంశధార నిర్వాసితులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలన్నారు. బుధవారం మెట్టూరు నిర్వాసితులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. పార్టీలకతీతంగా పాల్గొవాలని పిలుపునిచ్చారు. సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సిర్ల ప్రసాద్, జి.ఈశ్వరరమ్మ, సీతారాం, నారాయణ పాల్గొన్నారు.

కర్తలిపాలెంలో పంటకోత ప్రయోగాలు

సోంపేట: మండలంలోని కర్తలిపాలెలో మంగళవారం వ్యవసాయ అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గణాంకాధికారి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యాన వ్యవసాయ సహాయ సిబ్బంది పంటకోత ప్రయోగాలు చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సకాలంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించి వివరాలను సంబంధిత యాప్‌ల్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపగనంకాధికారి నంద, వై.జోగారావు, ఎఇఒ శంకరరావు, ప్రవీణ్, సర్పంచ్ గున్నయ్య పాల్గొన్నారు.

నైర విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని 16 వ్యవసాయ కళాశాలల విద్యార్థుల క్రీడ, సాహితీ, సాంస్కృతిక పోటీల్లో శ్రీకాకుళం రూరల్ మండలం నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 8 నుంచి 11 వరకు బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ పోటీల్లో నైర కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్‌లో ప్రథమ, షటిల్ బాట్మింటెన్‌లో ద్వితీయ, బాల్ బాట్మింటెన్ నైర, బాపట్ల కళాశాలల విద్యార్థులు సంయుక్తంగా ప్రథమ బహుమతులు గెలుపొందారు. అలాగే బాలికల వంద మీటర్ల పరుగు పందెంలో పుష్పాంజలి ప్రథమ, లాంగ్‌జంప్‌లో బంక పవన్ కళ్యాణ్ తృతీయ బహుమతులు సాధించారు. సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులు నికిల్ సూర్యప్రకాష్‌లు ఎక్స్‌ఎంపోర్‌లో ద్వితీయ, సోలో సాంగ్స్‌లో కె.స్నేహిత ద్వితీయ బహుమతు గెలుచుకొన్నారు. సోలో ఫోక్ డాన్స్‌లో ఎ.గాయత్రి తృతీయ, ఆఖరి సంవత్సరం విద్యార్థులు నటించిన నేటి సమాజం నాటికకు తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థి వ్యవహారాల ఇన్‌ఛార్జి డాక్టర్ ఎస్.గోవిందరావు, పీడీ ఎ.పురుషోత్తమరావు, కళాశాల అధ్యాపకులు డాక్టర్లు ఎ.ఉపేంద్ర, ఎ.అప్పలస్వామి, డి.చిన్నంనాయుడు, జి.మోహన్నాయుడు, పి.గురుమూర్తి, ఎస్.దుర్గా, వి.ఉమామహేష్, ఎన్.సునంద, డి.అనిల్ కుమార్, బి.రాజేంద్రకుమార్ ఎస్.భారతి, జి.ఎస్.రాయ్, లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

క్రీడల్లో రాణిస్తే ఉన్నత అవకాశాలు

ప్రజాశక్తి - పలాస

క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే ఉన్నతమైన అవకాశాలు లభిస్తాయని ఎంపిపి ఉంగ ప్రవీణ అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఒకటో జోన్ అంతర పాఠశాలల 66వ బాల బాలికల జూనియర్ సీనియర్స్ ఆటల పోటీలు (గ్రిగ్స్) మంగళవారం ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి, అధికారికంగా క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక, మానసిక వికాసంతో పాటు ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. కరోనా సమయంలో ఎవరైతే శారీరక ఆరోగ్యాన్ని కలిగి ఉండి, మనోధైర్యం కలిగిన వారే మహమ్మారి నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు, వీడియో గేమ్ బానిసలై అసలైన క్రీడలకు దూరం అవుతున్న విషయం ఆందోళన కలిగిస్తుందన్నారు. రోజువారి ఒత్తిడి నుంచి బయట పడాలంటే క్రీడలు మన జీవన విధానంలో ఒక భాగం కావాలన్నారు. అలాగే ఆటలో గెలుపోవటములు సహజమని, రెండింటినీ ఒకేలా తీసుకుని క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో పిసిసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, వైసిపి నాయకులు ఉంగ సాయికృష్ణ, ఎంపిటిసి తుంగాన రవణమ్మ, సర్పంచ్ బాడన పుష్ప, జెడ్‌పిటిసి ప్రతినిధి మచ్చ రత్నాలు ఎంపిటిసి మాజీ సభ్యులు దంతం వైకుంఠరావు, మాజీ సర్పంచ్ పూన ఆనందం, విద్యా కమిటీ చైర్మన్ రఘు పాత్రుని రమేష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు చెల్లూరు పద్మలోచనం పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎంపిపి ప్రవీణ

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఇ దేవప్రసాద్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో బుధవారం నుంచి వారం రోజుల పాటు విద్యుత్‌శాఖ ఆధ్వర్యాన ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఇపిడిసిఎల్ సర్కిల్ సూపరింటెండెంట్ దేవప్రసాద్ పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయంలో పొదుపు వారోత్సవాల పోస్టరును మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 14న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విద్యార్థులకు పొదుపుపై అవగాహన కల్పిస్తున్నామని అన్నాఉరు. 15న చిత్ర లేఖన పోటీలు, 16న ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇన్నోవేషన్ ఆఫ్ ఎఫిసెన్సీపై సెమినార్, 17న ఆపరేషన్ డివిజన్ ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 18న ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్లతో విద్యుత్ వినియోగంపై విస్తృత ప్రచారం, 19న గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వాడకంపై అవగాహనా కార్యక్రమంలో 20న ముగింపులో విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిఇఇ పాత్రుడు, ఎఇలు కమల్‌హాసన్, సురేష్‌లు పాల్గొన్నారు.

మార్కర్ యంత్రంపై అవగాహన

ప్రజాశక్తి - రణస్థలం

జిల్లా వ్యాప్తంగా దుక్కి దున్నకుండానే మొక్కజొన్న సాగు (జీరో టిల్లేజి) పద్ధతి రైతుల్లో ప్రాచుర్యం పొందడం ఆనందంగా ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని కమ్మసిగడాం, తిరుపతిపాలెం, నెలివాడ గ్రామాల్లో దున్నకుండా మొక్కజొన్న విత్తుతున్న రైతుల పంట పొలాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలకరి వరిచేను కోసిన తరువాత పొలంలో వరి కొయ్యకాల్లలో దుక్కి దున్నకుండానే పదును చూసుకుని మొక్కజొన్న విత్తనాలు నేరుగా విత్తుకోవాలన్నారు. ఈ విధానంలో రైతులకు దుక్కి దున్నే ఖర్చులు ఆదా అవడమే కాకుండా నెలరోజుల పంట కాలం కలిసి వస్తుందన్నారు. శాస్త్రీయ పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆముదాలవలస ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సూచనల మేరకు ఉక్కుతో చేసిన 'డబుల్ వీల్ మార్కర్' అనే రెండు చక్రాల మార్కర్ యంత్రాలకు రూపకల్పన చేశామన్నారు. 18 మండలాల్లో రూ.25 లక్షల వ్యయంతో మండలానికి 40 యంత్రాల చొప్పున 720 యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇప్పటి వరకూ అందుబాటులో ఉన్న యంత్రాలతో పది వేల ఎకరాల్లో వరి కోతల అనంతరం దున్నకుండా మొక్కజొన్న సాగును చేపట్టామని తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న హరిబాబు

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

టిడిపి హయాంలో సంక్షేమానికి తూట్లు

ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- లావేరు

టిడిపి ప్రభుత్వం హయాంలో సంక్షేమానికి తూట్లు పొడిచారని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు ఇంటింటికే అందజేస్తున్నారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన్నమురపాకలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ఇంతవరకు ఏ మేర లబ్ధిపొందారో చదివి వినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి హయాంలో జన్మభూమి కమిటీలకు అధికారులు అప్పగించి టిడిపి కార్యకర్తలకే పథకాలు ఇచ్చేవారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం విద్య, వైద్యం రంగాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మాజీ ఎంపిపి డి.రాజనాయుడు, లావేరు పిఎసిఎస్ అధ్యక్షుడు బూరాడా చిన్నారావు, సర్పంచ్ ఎం.పార్వతి, తాళ్లవలస ఉప సర్పంచ్ దేశెట్టి తిరుపతిరావు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

వార్డుల అభివృద్ధే ధ్యేయం

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వార్డుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక 21వ వార్డు వివేకానంద నగర్‌లో రూ. 7.80 లక్షల వ్యయంతో 150 మీటర్లు, 18వ వార్డు మారుతీ నగర్‌లో రూ. 6.20 లక్షల వ్యయంతో 138 మీటర్లు, మారుతీ నగర్‌లో రూ.5 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి వార్డును అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్లు పప్పల ప్రసాద్, సనపల సింహాచలం, గుజ్జు జోగరావు, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్, డిఇఇ బల్ల హరి, ఎఇఇ అవినాష్ పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ప్రతినిధులు

క్షయ రోగులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ రోగులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు విరాళాన్ని అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి టి.బి.ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 300 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలపాటు పౌష్టికాహారం అందించేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల నుంచి రూ.12.60 లక్షల చెక్కును కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి, అదనపు డిఎంహెచ్ఒ ఎన్.అనూరాధ పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నోడల్ జైకెసి ఆధ్వర్యాన రెండు రోజుల పాటు చేపట్టిన జాబ్‌మేళా మంగళవారం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 120 మంది విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించారు. హెట్రో కంపెనీకి 13 మంది, ఐసిఐసిఐ బ్యాంకులో పనిచేసేందుకు నలుగురు ఎంపికయ్యారు. రాత, మౌఖిక విధానంలో ఈ ఎంపికలను నిర్వహించారు. ఎంపికలను ప్రిన్సిపాల్ సురేఖ, జెకెసి సమన్వయకర్త పైడితల్లి పర్యవేక్షించారు. ఎంపికల్లో వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, ఐక్యూఎసి సమన్వయ అధికారి డాక్టర్ శాంతీదేవి, కంపెనీల హెచ్ఆర్‌లు మణికంఠ, ఎం.ప్రసాద్, ఎన్.దామోదర్, ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెంపు

ఆమదాలవలస : మండలంలోని చేపేనపేట యూనిట్ పరిధిలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన వెయ్యి కేజీల టైప్-2 ఘనజీవామృతాన్ని చెరకు పొలానికి వినియోగానికి మంగళవారం తయారు చేశారు. ముందుగా తయారు చేసుకున్న జీవామృతాన్ని పశువుల పెంట గత్తంపై వేసుకొని బాగా కలుపుకొని పొలంలో ఉపయోగించడంతో బహుళ ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి తెలిపారు. అలాగే భూమి సారాన్ని పెంచవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, మల్లేశ్వరరావు, కృష్ణవేణి పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో నూతన ఆవిష్కరణలు

జలుమూరు : విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిపి గోపి

ప్రజాశక్తి- జలుమూరు

విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలని ఎంపిపి వాన గోపి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మండల స్థాయిసైన్స్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన నిత్యజీవితంలో అనునిత్యం సైన్స్ ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం ప్రాజెక్టులను పరిశీలించి వాటి పనితీరును విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. ఎంఇఒ మాధవరావు మాట్లాడుతూ మండలంలోని 16 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని 45 ప్రాజెక్టులు ప్రదర్శించారని అన్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో ఎంపికైన ప్రాజెక్టులు మండలస్థాయిలో ప్రదర్శించామన్నారు. వీటిలో ఎంపికైన సైన్స్ ప్రాజెక్టులను జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు పంపించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.వి. రవికుమార్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు, చల్లవానిపేట పిఎసిఎస్ అధ్యక్షులు పాగోటి రాజప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆమదాలవలస : విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీయాలని ఎంఇఒ దుప్పల రామారావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. పాఠశాల స్థాయిలో ఎంపిక కాబడిన ఐదు ప్రాజెక్టులతో 12 ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రాజెక్టులతో సహా ఈ ఎగ్జిబిషన్లో పాల్గొన్నారని తెలిపారు. మండల విద్య, సంక్షేమ అధికారి పైడి కూర్మారావు మాట్లాడుతూ ప్రతి ప్రాజెక్టూ ఆలోచనత్మకంగా ఉందన్నారు. విజేతల ఎంపికకు న్యాయ నిర్ణేతలుగా జూనియర్ కళాశాల అధ్యాపకులు వ్యవహరించారు. సైన్స్ ఎగ్జిబిషన్లో పాల్గొన్న విజేతలను ఎంపిక చేసి జిల్లాస్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఎంఇఒ తెలిపారు.

కవిటి: కొత్తకొత్త ఆలోచనలకు, నూతన ఆవిష్కరణలకు వైజ్ఞానిక ప్రదర్శనలే ఆరంభమని ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. మండలంలోని ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పర్యావరణ అనుకూల వస్తువులు, ఆరోగ్యం - పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్, యాప్‌లు, వాతావరణం మార్పులు, గణిత నమూనాలు అనే అంశాలపై విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ ఆవిష్కరణల్లో జెడ్‌పిహెచ్ఎస్ ముత్యాలపేట, జెడ్‌పిహెచ్ఎస్ ఇద్దివానిపాలెం, జెడ్‌పిహెచ్ఎస్ సహలాలపుట్టుగ, జిహెచ్ఎస్ కవిటి, ఎపిఎంఎస్ రాజపురం పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.రామకృష్ణ, ఎం.మురళీకృష్ణ, త్రిలోచన బిసాయి, ఉపాధ్యాయులు ఎస్.రాజబాబు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వం పాఠశాల ఆవరణలో మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించామని ఎంఇఒ అప్పారావు తెలిపారు. మొదటి విభాగంలో కె.రజని, రెండో విభాగంలో ప్రసన్న, మూడో విభాగంలో కె.విద్యారెడ్డి, నాలుగో విభాగంలో పి.దీపక్‌కుమార్, ఐదో విభాగంలో కె.మహిజ విజేతగా నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం త్రినాథరావు, ఉపాధ్యాయులు మల్లేష్, సిఆర్‌పిలు ఆర్.దేవరాజు, గణేష్, మోహనరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నందిగాం : నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎగ్జిబిషన్‌లో పర్యావరణ అనుకూల వస్తువులు, ఆరోగ్యం, పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్, యాప్‌లు ప్రదర్శించారని ఎంఇఒ జి.నరసింహులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, వై.హరిబాబు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : విద్యార్థులు విజ్ఞానంపై మక్కువ పెంపొందించుకోవాలని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శనలను ప్రారంభించారు. మండలంలోని 16 ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో ఎకో సిస్టమ్ మెటీరియల్స్ బయో గ్యాస్ పాతటెక్కలి విద్యార్థి వై.శైలజ, ఆరోగ్యం పరిశుభ్రత విభాగంలో మెడికల్ ప్లాంట్ నగరంపెల్లి విద్యార్థి హారిక, సాఫ్ట్‌వేర్ అండ్ అప్స్‌లో ఏంటి స్లీప్ అలారం వంకులురు విద్యార్థి కె.ఇందు, ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ చేంజ్‌లో గ్రీన్ బి స్మార్ట్ హౌజ్, దోకులపాడు విద్యార్థి అవినాష్, మెత్మేటికల్ మోడలింగ్ త్రిగానమెట్రీ నగరంపెల్లి విద్యార్థి సిహెచ్.ఈశ్వరి మొదటి స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పలస్వామి, పిఎసిఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, ఎంపిటిసి ప్రతినిధి బి.మోహనరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉదయ్‌కుమార్

కవిటి : విద్యార్థుల ప్రదర్శనలు పరిశీలిస్తున్న ఎంఇఒ ధనుంజయ

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో ఐదు ప్రాజెక్టులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఇఒ పి.వి.రామరాజు తెలిపారు. జిల్లాస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల్లో పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు, ఎపి మోడల్ స్కూల్ నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు హరగోపాల్, రత్నప్రభ, గోవిందలు వ్యవహరించారు. జిల్లాస్థాయి సైన్స్‌పోటీలకు ఎంపికైన విద్యార్థులను పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒ ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్‌లు అభినందించారు. **రణస్థలం** రణస్థలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. మండలంలోని 15 పాఠశాలల నుంచి 32 మంది విద్యార్థులు 58 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో ఐదు పాఠశాలలు జిల్లాస్థాయికి ఎంపికయ్యాయని ఎంఇఒ త్రినాథరావు తెలిపారు.

పొందూరు : ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఇఒ రామరాజు

ఇచ్ఛాపురం : ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఇఒ అప్పారావు

సిఎఫ్‌లపై స్త్రీనిధి ఎజిఎం అసహనం

మాట్లాడుతున్న ఎజిఎం సత్యనారాయణ

ప్రజాశక్తి- జలుమూరు

సిఎఫ్‌లు ఎక్కువ మంది రోజూ బ్యాంకుల్లోనే ఉంటున్నారని, వారికి బ్యాంకులతో ఏం పని అని స్త్రీనిధి ఎజిఎం వి.సత్యనారాయణ అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని వైఎస్ఆర్ రకాంతి పథంలో ఎంఎంఎస్ అధ్యక్షులు పిట్ట వనజాక్షి అధ్యక్షతన మంగళవారం విఒఎ, సిఎఫ్, సిసిలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకుల నుంచి సిసి పుట్టేజి తెప్పించుకుని చూశామని, ఎక్కువ మంది సిఎఫ్‌లు ఉంటున్నారని అన్నారు. బ్యాంకుతో పని ఉంటే ఆ పని చూసుకుని వచ్చేయాలి తప్ప అక్కడే ఉండి బ్యాంకు పనులు మీరు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు వైఎస్ఆర్ క్రాంతి పథంలో పనిచేస్తూ ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. డ్వాక్రా మహిళలకు వెలుగు కార్యాలయం నుంచి ఇవ్వాల్సిన రుణాలన్నీ ఇచ్చిన తర్వాతనే బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించాలని ఆదేశించారు. సిసిలకు ముందుగా తెలియజేయకుండా బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చేందుకు ఎందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలకు రూ.3 లక్షలు వరకే ఏడు శాతం వడ్డీ ఉంటుందని, రూ.3 లక్షలు దాటితే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, స్త్రీనిధి మేనేజర్లు శ్రీనివాసరావు, నాగరాజు ఎపిఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

ఇసుక ట్రాక్టర్ సీజ్

సంతబొమ్మాళి: అనుమతిలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. మంగళవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గుర్తించినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన జెడ్‌పిటిసి

ఇచ్ఛాపురం : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ కోరారు. ఈ మేరకు ఇచ్ఛాపురానికి వచ్చిన కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను రెవెన్యూ బంగ్లాలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం సమర్పించారు. మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో వంట గది నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే తహశీల్దార్ శిథిలావస్థలో ఉందని, నూతన కార్యాలయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఒ రాజారెడ్డి పాల్గొన్నారు.

పార్కు ఆక్రమణలపై ఫిర్యాదు

పట్టణంలోని బెలుల్పడలో ఉన్న అచ్చంపేటలో రూ.లక్షల విలువ చేస్తే ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ రికార్డుల ప్రకారం పార్కు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి ఆమోదం పొందితన తరువాత కేంద్ర ప్రభుత్త పథకం నిధులు రాకపోవడంతో పార్కు నిర్మాణం నిలిచిపోయిందన్నారు. ఆ తర్వాత కొంతమంది వ్యక్తులు పార్కుకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించారని అన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గణపతి, బడే దొరబాబురెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్‌పిటిసి నారాయణమ్మ

రణస్థలంలో 'పొలంబడి'

రణస్థలం: మండలంలోని రణస్థలంలో మొక్కజొన్న పంటలో నేచరల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ అధ్యక్షతన మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో మొక్క పెరుగుదలకు కావాల్సిన పోషకలను అందించేందుకు ఎకరానికి 15 నుంచి 20 రోజులకు ఒకసారి పంటకాలంలో ద్రవ జీవామృతం నేలపై విడిచిపెట్టాలన్నారు. దీంతో ఎటువంటి రసాయని ఎరువులు అవసరం లేకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించవచ్చునని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో నేలను ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఆచరించాలన్నారు. మొక్కజొన్నలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రణస్థలం డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న రాజేష్

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి పంచాయతీ బుడ్డెపుపేటలో శివాలయం పునర్నిర్మాణానికి నియోజకవర్గ జనసేన నాయకులు లోళ్ల రాజేష్ రూ.పది వేలు విరాళంగా అందజేశారు. ఆల పునర్నిర్మాణ విషయం రాజేష్ దృష్టికి తీసుకురావడంతో స్పందించి మంగళవారం విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, జనసేన నాయకులు బొండాడ మహేష్, తులసీదాసు పాల్గొన్నారు.

వృద్ధురాలికి వైద్య పరీక్షలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో కొన్ని రోజులుగా వెంకాయమ్మ అనే వృద్ధురాలు భిక్షాటన చేస్తూ అక్కడే రాత్రిపూట నిద్రిస్తుంది. రెండు రోజులుగా కదలలేని స్థితిలో బల్లపై పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఆమె స్థితిని గుర్తించిన వారు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ జి.జగన్మోహనరావుకు సమాచారం అందించారు. వెంటనే ఆయన స్పందించి బృందంతో అక్కడికి చేరుకుని వృద్ధురాలిని రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. మెదవళేశ్వరం ప్రాంతానికి చెందిన వృద్ధురాలిగా గుర్తించారు. కార్యక్రమంలో పెంకి చైతన్య కుమార్, పవన్ కుమార్, జగదీష్, మదీనా పాల్గొన్నారు.

ఆస్పత్రికి తరలిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

అర్హులందరికీ ఇళ్లు

నందిగాం: అర్హులైన ప్రతిఒక్కరికీ లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. నందిగాం సచివాలయం వద్ద నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను సర్పంచ్ ప్రతినిధి జాడ్యాడ జయరాం, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణుతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్క నిరుపేదకు ఇళ్లుకట్టించాలనే ధ్యేయంతోనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తమిరి ఫాల్గుణరావు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దళారులన నమ్మొద్దు

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందని ఎంపిపి అన్నారు. నందిగాం కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరించారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరించిన 21 రోజుల్లోనే ప్రభుత్వం ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి జడ్యాడ జయరాం, అంబోడి విష్ణు, తమిరె ఫాల్గుణరావు పాల్గొన్నారు.

బిందుశ్రీకి నాట్యకళా శిఖామణి అవార్డు

బిందుశ్రీని సన్మానిస్తున్న కళాకారులు

సోంపేట: సోంపేటకు చెందిన నటరాజ నాట్య కళామండలి అధ్యక్షులు బిందుశ్రీకి నాట్య కళాశాల అవార్డు లభించింది. ఏలూరులో పద్మశ్రీ అవార్డు గ్రహీత అన్నవరపు రామస్వామికి మంగళవారం ఘనసత్కారం చేశారు. అదే కార్యక్రమంలో నాట్య కళా శిఖామణితో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామస్తులు కళాకారులు అభినందనలు తెలియజేశారు. అంతర్జాతీయ కర్ణాటక మ్యూజికల్ డాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత కళాకారులందరూ పాల్గొన్నారు.